సాక్షి
నంద్యాల
బుధవారం । 16 । ఆగస్టు । 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కృష్ణా జిల్లాకు చెందిన శ్రీనివాసరెడ్డి రూ.1,01,116 లు విరాళంగా అందజేశారు.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ ప్రాంగణంలోని శనగల బసవన్న, శ్రీబయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



'సుంకేసుల'కు నిలిచిన ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలిచిపోయింది. ప్రస్తుతం డ్యాంలో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు మంగళవారం తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు ఎన్నికల అధికారులకు శిక్షణ

కర్నూలు(అర్బన్): ఈ నెల 19న గ్రామ పంచాయతీ సర్పంచు, వార్డు సభ్యుల ఉప ఎన్నికల నేపథ్యంలో స్టేజ్‌-2 రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 16న శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్ణాతులైన డ్వామా ఏపీడీ సిద్దలింగమూర్తి, సి.బెళగల్ ఎంపీడీఓ రాముడు శిక్షణ ఇస్తారన్నారు.

పంచాయతీల్లో ప్రారంభమైన నగదు రహిత చెల్లింపులు



చిన్నటేకూరులో డిజిటల్ చెల్లింపులను పరిశీలిస్తున్న డీపీఓ

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ పంచాయతీలో ప్రారంభించిన డిజిటల్ చెల్లింపులను పరిశీలించామన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసుకున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల జనాభాను అనుసరించి బ్యాంకు అధికారులు పీఓఎస్ మిషన్లు, క్యూఆర్ కోడ్‌లను సమకూర్చారన్నారు.

అన్ని పరీక్షల్లోనూ ఆమే ఫస్ట్



ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పి. నమ్రత

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసిస్తున్న పి. నమ్రత అన్ని రకాల పరీక్షల్లోనూ ప్రథమంగా నిలుస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది. ప్రస్తుతం ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని హౌస్‌సర్జన్ చేస్తున్న ఆమెకు తాజాగా మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆమె జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీలో ఫస్ట్‌గా నిలిచారు. అలాగే పార్ట్‌-2 ఎగ్జామ్‌లోనూ ఆమె ప్రథమంగా నిలిచింది. దీంతో పాటు జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు నిర్వహించిన శ్రీ దిగువింటి సాయిసృజన్ మెమోరియల్ ఎగ్జామ్‌లో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఆమె జనరల్ సర్జరీ ప్రొఫెసర్, హెచ్‌ఓడీ డాక్టర్ హరిచరణ్, కంటి వైద్యురాలు నివేదిత కూతురు.

జిల్లాకు చేరిన వీవీప్యాట్ మిషన్లు

కర్నూలు(సెంట్రల్): వచ్చే ఎన్నికల్లో వినియోగించేందుకు కేటాయించిన వీవీప్యాట్ మిషన్లు మంగళవారం కర్నూలు చేరాయి. వాటిని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఈవీఎం గోదాములో భద్రపరిచారు. బెంగళూరులోని బెల్ కంపెనీ తయారుచేసిన ఈ మిషన్లలో ఎన్నికల్లో ఎవరికి ఓటు వేశామో చూసుకునేందుకు ప్రింట్ కూడా వస్తుంది. జిల్లాకు 6,650 వీవీప్యాట్ మిషన్లను ఎన్నికల సంఘం కేటాయించింది.



ఆకట్టుకున్న గురురాజ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



నంద్యాల సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థుల కోలాటం



కేశవరెడ్డి స్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శన

సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి

- పల్లె చెంతకు సంక్షేమం, అభివృద్ధి చేరేలా పాలన
- నవరత్నాలతో పేదలందరికీ లబ్ధి
- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా
- కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ పోచా, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- అంబరాన్నంటిన 77వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు



ప్రసంగిస్తున్న మంత్రి అంజాద్ బాషా



నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, చిత్రంలో జిల్లా కలెక్టర్ మనజీర్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి అంజాద్‌బాషా



వేడుకలకు హాజరైన ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, తొగురు ఆర్థర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాల: స్వాతంత్య్ర సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి చేస్తున్నాం. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసి పేదలను ఆదుకుంటున్నాం' అని డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్‌బాషా అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయన స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మనజీర్ జిలానీ, ఏఎస్పీ వెంకటరాముడుతో కలసి కవాతు వాహనం పైనుంచి మంత్రి సాయుధ పోలీసు దళ పరిశీలన చేశారు. అనంతరం వేదిక పైనుంచి జిల్లా ప్రజలనుద్దేశించి మంత్రి ప్రసంగించారు. '' సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కింది. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన 6288 అర్జీలలో 4851 సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాం. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలు తెలుసుకుని 2.91 లక్షల సర్వీసులను నేరుగా ప్రజల వద్దకు వెళ్లి అందించాం.' జిల్లా అభివృద్ధిలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.475 కోట్లతో నూతన మెడికల్ కళాశాల నిర్మాణం పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. వచ్చే నెలలో మెడికల్ కళాశాలలో తరగతులు కూడా ప్రారంభమవుతాయి'' అన్నారు.

వ్యవసాయంలో నూతన ఒరవడి

వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ పథకం కింద 2023-24లో మొదటి విడతగా జిల్లాలో 2.22 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ.56.17 కోట్లు నేరుగా రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. ఈ ఖరీఫ్‌లో పంట రుణాల కింద 1,70,745 మంది రైతులకు రూ.3,239 కోట్లు బ్యాంకుల ద్వారా అందజేశాం. ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో నూతనంగా ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం కోసం ఒక్కో రైతుకు హెక్టార్‌కు రూ.71 వేలు రాయితీతో వెయ్యి హెక్టార్లను లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 5వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు చేయడానికి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. శ్రీశైల జలాశయంలో నీటి లభ్యతను బట్టి ఈ ఏడాది కేసీ కెనాల్ కింద 1,75,388 ఎకరాలకు, ఎస్సార్‌బీసీ కాలువల ద్వారా 1,31,450 ఎకరాలకు, తెలుగు గంగ ప్రాజెక్టు కింద 1,01,600 ఎకరాలకు, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4,900 ఎకరాలకు, 38 ఎత్తిపోతల పథకాల ద్వారా 38,647 ఎకరాలకు, శివభాష్యం ప్రాజెక్టు కింద 6 వేల ఎకరాలకు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా 43,304 ఎకరాలకు సాగునీటిని అందించనున్నాం.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు.

పేద విద్యార్థుల బంగారు భవిత కోసం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలను ప్రభుత్వం అమలు చేస్తోంది. పిల్లలందరినీ పాఠశాలలకు పంపేందుకు ''జగనన్న అమ్మ ఒడి'' పథకం కింద ఈ విద్యా సంవత్సరం జిల్లాలో అర్హత కలిగిన 1,67,084 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ. 218 కోట్లు జమ చేశాం. మనబడి నాడు-నేడు కింద రూ.118 కోట్లతో 486 ప్రభుత్వ పాఠశాలలను అత్యంత సుందరంగా ఆధునికీకరించి వాటికి కావల్సిన సదుపాయాలను కల్పించాం. ప్రస్తుతం రెండవ దశలో రూ.366 కోట్ల ఖర్చుతో 952 ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించేందుకు పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. 'జగనన్న విద్యా దీవెన' పథకంలో భాగంగా 2022-23 మొదటి విడతలో 36,352 మంది విద్యార్థులకు రూ.24.94 కోట్లు, రెండవ విడతలో 28,486 మందికి రూ 23.92 కోట్లు, జగనన్న వసతి దీవెన పథకం కింద 3,547 మంది విద్యార్థులకు 33.83 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమ చేశాం.

పేదలందరికీ ఇళ్లు..

పేదల సొంతింటి కల నిజం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకం కింద జిల్లాలో 326 జగనన్న లేఅవుట్‌లలో 45,429 గృహాలను మంజూరు చేశాం. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటి వరకు 32,682 గృహాల నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. ఇందులో 10,830 గృహాలు బేస్ మట్టం స్థాయిలో ఉండగా, 2,825 గృహాలు రూఫ్ స్థాయిలో ఉన్నాయి. జిల్లాలో గృహ, పారిశ్రామిక వినియోగదారులకు నిరంతరంగా 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం.

సంక్షేమ పథకాలు ప్రజల వద్దకే ..

సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించే ఉద్దేశంతో జిల్లాలో 6,870 మంది గ్రామ వలంటీర్లు, 1,891 మంది వార్డు వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. 50 ఇళ్లకు ఒక్కొక్క వలంటీర్ ద్వారా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా ఇంటి వద్దకే అందేలా చర్యలు తీసుకున్నాం. జిల్లాలో 409 గ్రామ సచివాలయాలు, 107 వార్డు సచివాలయాల్లో 5,580 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు. జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం ద్వారా మన భూములు, ఆస్తుల రక్షణకు, వివాదాలు లేని స్వచ్ఛమైన భూ రికార్డులను రూపొందించేందుకు ఆధునిక పరిజ్ఞానంతో భూ రీసర్వే పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇప్పటి వరకు మొత్తం 87 గ్రామాల్లో డ్రోన్ టెక్నాలజీ ద్వారా సర్వే పూర్తి చేశాం.

స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులకు సత్కారం

వేడుకల్లో భాగంగా జిల్లాకు చెందిన స్వాతంత్య్ర సమరయోధులైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, వడ్డే ఓబన్న, ఖాదర్‌బాదర్ నరసింగరావు, బొల్లవరపు వెంకటసుబ్బారెడ్డి కుటుంబీకులకు మంత్రి అంజాద్‌బాషా, కలెక్టర్ మనజీర్ జిలానీ తదితరులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వేడుకల్లో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మెన్ పీపీ నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ శాఖ సలహాదారుడు హబీబుల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

శకటాల ప్రదర్శనలో..

ప్రథమ బహుమతి	: ఆర్‌డబ్ల్యూఎస్
ద్వితీయ బహుమతి	: సూక్ష్మ సేద్యం
తృతీయ బహుమతి	: వ్యవసాయం, డీఆర్‌డీఏ, వైద్య, ఆరోగ్య

ఛాయాచిత్ర ప్రదర్శనలో..

ప్రథమ బహుమతి	: డ్వామా
ద్వితీయ బహుమతి	: వ్యవసాయం
తృతీయ బహుమతి	: డీఆర్‌డీఏ
కన్సోలేషన్ బహుమతులు	: వైద్య, ఆరోగ్య డీఈఓ, స్త్రీ శిశు సంక్షేమం, ఉద్యానం

అభివృద్ధి, సంక్షేమాన్ని చాటి చెప్పేలా..

డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లు అభివృద్ధి, సంక్షేమంతో పాటు జిల్లా అభివృద్ధి ప్రతిబింబించేలా ఉన్నాయి. స్టాళ్లను అధికారులతో కలసి మంత్రి పరిశీలించారు. అలాగే డీఆర్‌డీఏ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్, హౌసింగ్, వ్యవసాయం స్త్రీ, సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఉద్యానం, రవాణా, సూక్ష్మ సేద్యం, సివిల్ సప్లయ్, అగ్నిమాపక తదితర శాఖల శకటాల ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన దేశభక్తిని చాటాయి. మైదానంలో దేశభక్తి గేయాలు హోరెత్తాయి. మువ్వెన్నల జెండాలు రెపరెపలాడాయి. స్వాతంత్య్ర దినోత్సవ వేడకల సంబరాలు అంబరాన్ని తాకాయి.

విద్యార్థినికి మంత్రి అభినందన



విద్యార్థిని రాజేశ్వరిని అభినందిస్తున్న డిప్యూటీ సీఎం, కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): ఐక్యరాజ్యసమితి వరల్డ్ బ్యాంక్ అమెరికా అధ్యక్ష భవనం సందర్శనకు ఎంపికైన స్థానిక బొమ్మలసత్రానికి చెందిన విద్యార్థిని రాజేశ్వరిని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అభినందించారు. మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి చేతుల మీదుగా విద్యార్థిని అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకుంది. నంద్యాల మోడల్ స్కూల్‌లో పదవ తరగతిలో 583 మార్కులు సాధించి ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీలో చదువుతుందని, విద్యార్థిని ప్రతిభను మెచ్చుకొని రాష్ట్ర ప్రభుత్వం అమెరికా అధ్యక్ష భవనం సందర్శనకు ఎంపిక చేసినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.



మొదటి బహుమతి అందుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ శకటం



రెండవ బహుమతి అందుకున్న సూక్ష్మ సేద్యం శకటం



మూడవ బహుమతి అందుకున్న వైద్య, ఆరోగ్య శాఖ శకటం

మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రం

కర్నూలు(లీగల్): మహనీయుల పోరాట ఫలితమే స్వాతంత్య్రమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. పంద్రాగస్టు వేడుకలను మంగళవారం జిల్లా కోర్టులో ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు జిల్లా కోర్టులో జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎ.శ్రీనివాస్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పాండురంగారెడ్డి, ఏసీబీ కోర్టు జడ్జి సునిత, సబ్ జడ్జీలు దివాకర్, సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జీలు ఫక్రుద్దీన్ బాబా, టి.జ్యోత్స్నా దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎంవీ చక్రపాణి, జీపీ ఆనందరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లక్ష్మీనారాయణ, రాంభగవాన్, నరేంద్రనాథ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జి.స్వాములు, జూనియర్ సివిల్ జడ్జీలు కల్యాణి, పఠాన్ సియాజ్ ఖాన్, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు

స్వాతంత్య్ర సమరయోధులే స్ఫూర్తి

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): దేశానికి స్వాతంత్య్రం సాధించి పెట్టిన సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగుదామని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు జెడ్పీ ప్రాంగణంలో ఉన్న జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, చైర్మన్ సీసీ అశ్వినీకుమార్, కార్యాలయ పర్యవేక్షకులు రాంగోపాల్, జితేంద్ర మురళీమోహన్‌రెడ్డి, కర్నూలు ఎంపీడీఓ ఆజాంఖాన్ పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీ దుగా ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నారు. 2021లో రాజమండ్రి ఇంటలిజెన్స్ విభాగంలో ఉత్తమ సేవలను అందించిన ఎస్పీని స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీఎం మెడల్ అందజేసి అభినందించారు.

ఎస్పీ సర్వీసులో కొన్ని ముఖ్యమైన అంశాలు

- సబ్‌-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిపై లోతైన విచారణ చేశారు. 2019లో మంటూరు (దేవీపట్నం) పడవ ప్రమాదానికి గల కారణాలపై సాంకేతిక విశ్లేషణ, ఉదాసీనత కలిగిన ప్రభుత్వోద్యోగులు, ప్రమాదం సంభవించకుండా ఉండుటలో ప్రధాన పాత్ర పోషించారు.
- గోదావరి జిల్లాల్లోని పేదలకు, రంపచోడవరం చుట్టుపక్కల ఉన్న ఏజెన్సీ గిరిజనులకు వైద్య, ఆరోగ్య సదుపాయాలపై విశ్లేషణ, మెడికల్ కాలేజీ, మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు ఆవశ్యకతపై చర్యలను ప్రభుత్వానికి సూచించారు.
- అన్నవరం దేవస్థానం పాలనాపరమైన ఆరోపణలపై విచారణ చేశారు.
- గోదావరి జిల్లాల్లో జరుగుతున్న నకిలీ పాస్‌పోర్టు మోసాలపై కొన్ని ఆధారాలతో పాటు ఆధారాలతో అప్రమత్తం చేశారు.
- తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇసుక రవాణా ప్రధాన సమస్య. దీంతో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండటానికి, పారదర్శకతను కొనసాగించడానికి, ఇసుక రవాణాపై నిశిత నిఘా ఉంచారు.



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మెడల్‌ను అందుకుంటున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

క్లుప్తంగా

వరుసగా రెండో ఏడాది



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

కర్నూలు సిటీ: మునిసిపల్ స్కూళ్ల విభాగంలో డా.ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా నిలిచింది. ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆ స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. వరుసగా రెండో ఏడాది రాష్ట్ర స్థాయి అవార్డు దక్కడంతో హెచ్‌ఎంకు పలువురు అభినందనలు తెలిపారు.

గొర్రెల మందపై చిరుతలు దాడి

- ఒక గొర్రె మృతి

కోసిగి: స్థానిక తిమ్మప్ప కొండ వెనుక భాగంలోని సత్యమ్మ గుడి సమీపంలో నిలిపిన గొర్రెల మందపై మంగళవారం రాత్రి రెండు చిరుతలు దాడి చేశాయి. గొర్రెల కాపరి నరసప్ప అలియాస్ తిక్కయ్యకు చెందిన ఒక గొర్రెను కొండల్లోకి ఈడ్చుకెళ్లిందని కాపరులు తెలిపారు. కాపరులు కేకలు వేయడంతో కొండ పరిసరాల్లో గొర్రెకు సంబంధించి పొట్ట భాగం మాత్రమే వదిలేసి వెళ్లిందని నరసప్పతో పాటు పలువురు తెలిపారు. కోసిగి పరిసరాల్లో నాలుగేళ్లుగా చిరుతలు సంచరిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. కొండ పరిసర ప్రాంతాల్లో గొర్రెలు, కుక్కలపై చిరుతులు దాడి చేసిన ఘటనలు వారంలో రెండు మూడు చోటు చేసుకుంటున్నాయి. అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కొండ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌లో 985 టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఆటో నగర్‌కు చెందిన యశోదమ్మ, పాతపేటకు చెందిన ఈడిగ వినయ్ కుమార్ గౌడ్ తారకరామనగర్‌లోని కాలువ దగ్గర కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేసి వారిద్దరిని అదుపులోకి తీసుకొని 10 బాక్సుల మద్యం (టెట్రా ప్యాకెట్లు)స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి జడ్జి ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది ఓబులేసు, చాంద్‌బాషా, మద్దిలేటి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు సిటీ: నంద్యాల జిల్లా ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1966 ఎస్‌ఎస్‌ఎల్‌సీ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం నగరంలో ఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. 57 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు మద్దెల రంగారెడ్డి, ఓబుల్ రెడ్డిలను సత్కరించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు వైవీ కృష్ణారెడ్డి, ఎస్.జయరామయ్య, ఎస్.శంకర్ రెడ్డి, టి.వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరాముడు, ఏఎస్పీ, నంద్యాల | వి.ప్రభాకర్‌రెడ్డి, టూటౌన్ సీఐ, నంద్యాల | ఎం.రామయ్య, ఎస్‌ఐ, నంద్యాల | శివశంకర్‌రెడ్డి, తాలూకా సీఎస్, నంద్యాల | వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ, బనగానపల్లె | పి.విద్యాసాగర్, పీఎస్, మహానంది | ఎం.కృష్ణమూర్తి, టూటౌన్, నంద్యాల | శ్రీనివాసులు, ఆర్‌డీఓ, నంద్యాల | సుధాకర్ రెడ్డి, డీఈఓ, నంద్యాల | అలివేలమ్మ, హెచ్‌ఎం, అయ్యలూరు | డాక్టర్ జఫరుల్లా, నంద్యాల | శివారెడ్డి, డీటీసీ, నంద్యాల | శ్రీధర్‌రెడ్డి, డీఆర్ డీఏ పీడీ, నంద్యాల



మంజులవాణి, డీపీఓ, నంద్యాల | మల్లికార్జున, డీపీఆర్‌ఓ, నంద్యాల | రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ | రమణారెడ్డి, ఈఈ, నంద్యాల | రామ్మోహన్‌రావు, పీఆర్ ఈఈ, నంద్యాల | మోహన్‌రావు, డీఏఓ, నంద్యాల | విజయ భాస్కరనాయుడు, హౌసింగ్ పీడీ, నంద్యాల | సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఈఓ, నంద్యాల | డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ | జనార్దన్‌శెట్టి, తహసీల్దార్, మహానంది | రామచంద్రారావు, ఆర్‌ఐ, గోస్పాడు | సుబ్బయ్య, తహసీల్దార్ కార్యాలయం, పాణ్యం | రవీంద్రారెడ్డి, వీఆర్‌ఓ, పాండురంగాపురం

ఉత్తమ సేవలకు సత్కారం



జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన 410 మంది ఉద్యోగ, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. మంగళవారం నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, కలెక్టర్ మనజీర్ జిలానీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జిల్లా రెవన్యూ అధికారి పుల్లయ్య.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



వెంకటరెడ్డి, ఆర్‌డీఓ, డోన్ | సూర్యమౌళి, ఇంటలిజెన్స్ ఎస్‌ఐ | నాగన్న, కానిస్టేబుల్, నంద్యాల | అబ్దుల్‌కరీం, ఎంఈఓ, గోస్పాడు



డాక్టర్ హనీఫ్ సూపరింటెండెంట్ డోన్ ఆసుపత్రి | డాక్టర్ అంకిరెడ్డి, ఎంహెచ్‌ఓ, నంద్యాల | డాక్టర్ షభ్నం, నంద్యాల | శివప్రసాదరెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్



రష్మిత, పంచాయతీ సెక్రటరీ ఉయ్యాలవాడ | శ్రీనివాసులు, సమాచార శాఖ | యాంగంటేశ్వరప్ప, వ్యాఖ్యాత | శ్రీనివాసులు, ఆర్టీసీ ఆర్‌ఎం



కృష్ణారెడ్డి, హౌసింగ్ డీఈఈ బనగానపల్లె | వీరేంద్ర, హౌసింగ్ ఏఈ, డోన్ | రమేష్, హౌసింగ్ ఏఈ, మిడుతూరు | షాకీర్, హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఆత్మకూరు | గంగాధర్, డీపీఓ కార్యాలయ ఏఓ | చంద్రకాంత్‌రెడ్డి, డీపీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ | జగదీష్‌కుమార్, డీపీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ | ఫక్రుద్దీన్, ఈఓపీఆర్‌డీ, మిడుతూరు | రాధిక, ఈఓపీఆర్‌డీ, కోవెలకుంట్ల | వరప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్, నంద్యాల | డాక్టర్ రాధికా జ్యోతి, నంద్యాల | గిరి శంకర్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ సీనియర్ అసిస్టెంట్ | చింతామణి, సోషల్ వెల్ఫేర్ డీడీ, నంద్యాల



శ్రీనివాసయాదవ్, డీఐసీ జీఎం | పెద్దన్న, జిల్లా జమీందార్ కలెక్టరేట్ | వై.స్నేహలత, కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ | ప్రియతంరెడ్డి, ఎస్‌బీ సీఐ, నంద్యాల | అశోక్, ఎస్‌ఐ, పాణ్యం | మధుబాబు, డీఈఓ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ | వాసుదేవుడు, హౌసింగ్ ఏఈ, మహానంది | విజయభాస్కర్‌రెడ్డి, మెప్మా, సీఎంఎం | కేవీ సుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ | రామేశ్వరమ్మ, ఆర్‌ఐ కలెక్టరేట్ | మంజులారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ | నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ | జగదీష్‌చంద్రారెడ్డి, మెడికల్ ఆఫీసర్



డాక్టర్ కె.సునిత, మెడికల్ ఆఫీసర్ | వెంకటరమణ, శానిటేషన్ మేస్త్రీ | వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ డీపీఆర్‌ఓ | నాగరాజు, డీపీఆర్‌ఓ ఆఫీసు సబార్డినేట్ | టోపి.శేఖర్, డీఆర్‌డీఏ కో ఆర్డినేటర్ | చరణ్, జూనియర్ అసిస్టెంట్, డీపీఆర్‌ఓ | నాగరాజు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి | శ్రీకళారెడ్డి, ఏపీఓ, నంద్యాల | సునిత, ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ | షేక్ రుమానా డిజిటల్ అసిస్టెంట్, కానాల | ఉమామహేశ్వరమ్మ, ఆత్మ డీటీఎం | ఏవీ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ | షేక్ సుకూర్‌బాషా, కంప్యూటర్ ఆపరేటర్







స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నంద్యాల డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకులను సత్కరిస్తున్న మంత్రి అంజాద్ బాషా, కలెక్టర్ మనజీర్



డీఆర్‌డీఏ వైకేపీ, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఫండ్ అందజేస్తున్న మంత్రి

2.80 లక్షల హెక్టార్లలో పంటల సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఖరీఫ్ సాగు క్రమంగా పెరుగుతోంది. ఇటీవల వరకు జిల్లా వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు పడటంతో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ నెల 8వ తేదీ నాటికి సాగు విస్తీర్ణం 2,51,983 లక్షల హెక్టార్లు ఉంది. ఇటీవలి వరకు ఆశాజనకంగా వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సాధారణ సాగు 4.21 లక్షల హెక్టార్లు ఉండగా.... ఈ నెల 14 నాటికి సాగు విస్తీర్ణం 2,80,659 హెక్టార్లకు పెరిగింది. గత ఏడాది ఇదే సమయానికి 3.39 లక్షల హెక్టార్లలో పంటలు సాగు అయ్యాయి. ఈ సారి వర్షాలు ఆలస్యంగా పడటంతో సాగు కొంత తగ్గింది. ఇప్పటి వరకు పంటల సాగు 66.58 శాతం పూర్తి అయింది. అత్యధికంగా పత్తి సాగు కావడం విశేషం. సాధారణ సాగు 2.50 లక్షల హెక్టార్లు ఉండగా... ఇప్పటి వరకు పత్తి 1,70,748 హెక్టార్లలో సాగు అయింది. వేరుశనగ 39,543, వరి 2884, ఆముదం 6753, సజ్జ 4798, మొక్కజొన్న 3488, కంది 19038, మిర్చి 17218, ఉల్లి 10048, టమాట 973, కొర్ర 1189 హెక్టార్ల ప్రకారం పంటలు సాగు అయ్యాయి.

లారీ పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : ప్యాపిలి వద్ద అక్రమంగా డీటైయిన్డ్ ఫౌడర్ తరలిస్తున్న లారీని దాడి చేసి పట్టుకున్నట్లు మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున ప్యాపిలి వద్ద ఆ లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. లారీ యజమానికి రూ.50 వేలు జరిమానా విధించామని వెల్లడించారు.

కళలు సమాజ చైతన్య దీపికలు



నాటకాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ కుటుంబ సభ్యులు, ప్రేక్షకులు,



నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: కళలు సమాజ చైతన్య దీపికలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. 77వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రంలో మంగళవారం సాయంత్రం పడమటి గాలి నాటకాన్ని ప్రదర్శించారు. రిటైర్డ్ కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య దర్శకత్వంలో డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు రచనలో, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య నిర్వహణలో ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకులను అలరించింది. కలెక్టర్ డాక్టర్ జి.సృజన, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్, పారిశ్రామిక వేత్త బీవీ రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో నాటక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పడమటి గాలి నాటకం ఎంతో ఆలోచించేలా ఉందన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం కన్నా సమస్యలను పరిష్క రించుకుంటూ ముందుకు సాగాలనే సందేశం ఇచ్చారన్నారు. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ కళాకారులను ఆదుకోవడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బలరామయ్య జిల్లా కలెక్టర్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత తనలోని కళాకారుడిని నాటక రూపంలో బయటికి తీసుకురావడం సంతోషదాయకమన్నారు.

సిరుల పంట!

- జిల్లాలో పెరుగుతున్న బొప్పాయి సాగు
- ఇప్పటికే దాదాపు 5 వేల ఎకరాల్లో బొప్పాయి తోటలు
- ఈ ఏడాది మరో 1000 ఎకరాల్లో పెరుగునున్న సాగు
- తక్కువ పెట్టుబడి.. దిగుబడి ఎక్కువ
- మార్కెట్‌లో రికార్డు స్థాయి ధరలు
- రైతులకు కలిసి వస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహం



సాగు చేసిన బొప్పాయి పంట



కర్నూలు(అగ్రికల్చర్): బొప్పాయి సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుతం బొప్పాయికి ధరలు లభిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, అధిక నికరాదాయం వస్తుంది. దీంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటంతో పండ్లతోటల సాగు జోరందుకుంది. ఇదే సమయంలో బొప్పాయి సాగు కూడా పెరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో ఎటు చూసినా బొప్పాయి తోటలే కనిపిస్తున్నాయి. జిల్లాలో దాదాపు 5వేల ఎకరాల్లో ఉన్న ఈ పంట.. ఈ ఏడాది అదనంగా మరో 1000 ఎకరాలు పెరుగనుంది. బొప్పాయి సాగును ఇటు ఉద్యాన శాఖ, అటు జిల్లా నీటియాజమాన్య సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. తక్కువ వ్యవధిలో కాపునకు వస్తుండటంతో రైతులు ఈ పంట సాగును ముమ్మరం చేశారు. గతంలో బొప్పాయి అంటే కోయంబత్తూరు (కో–1, కో–2, కో–3) రకాలు ఎక్కువగా సాగు చేసేవారు. ఇటీవలి కాలంలో తైవాన్ రెడ్ లేడి–786 రకం బహుళ ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఉన్న బొప్పాయిలో 60 శాతం తైవాన్ రెడ్ లేడీ రకాలేనని స్పష్టమవుతోంది. ఎకరాకు 1000 మొక్కల వరకు నాటుకోవచ్చు. బొప్పాయి మొక్కలు నాటిన 6–7 నెలలకే కాపు వస్తుంది. మొదటి ఏడాది కాయలు ఎక్కువ సైజు, బరువుతో వస్తాయి. ఒక్కసారి మొక్కలు నాటితే రెండు, మూడేళ్లు పంట వస్తుంది. మొదటి ఏడాది మాత్రమే పెట్టుబడి వ్యయం ఉంటుంది. తర్వాత ఖర్చు నామమాత్రంగానే ఉంటుంది.


నేడు టన్ను ధర రూ.18 వేల వరకు

బొప్పాయికి నేడు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో రికార్డు స్థాయిలో ధరలు లభిస్తున్నాయి. సాధారణంగా బొప్పాయి టన్ను ధర రూ.5వేల నుంచి రూ.8 వేల వరకు ఉంటుంది. ఇప్పుడు మార్కెట్‌లో టన్ను ధర రూ.18 వేలు ఆపైనే ఉండటం రైతులకు ఆనందాన్ని ఇస్తోంది. జిల్లాలో పండించిన బొప్పాయి దేశంలోని అన్ని ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. కాగా బొప్పాయి సాగులో ఎకరాకు మొదటి ఏడాది గరిష్టంగా రూ.50 వేల వరకు పెట్టుబడి వస్తుంది. బిందు సేద్య సదుపాయం కల్పించుకుంటే దిగుబడి ఎకరాకు 60 టన్నుల వరకు వస్తుంది. సూక్ష్మ సేద్యం కింద సాగు చేస్తే దిగుబడిలో నాణ్యత కూడా పెరుగుతుంది. చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సూక్ష్మ సేద్య సదుపాయాన్ని కల్పిస్తోంది.

బొప్పాయితో అనేక ఉపయోగాలు

బొప్పాయిలో సమృద్ధిగా లభించే విటమిన్–సీ దంతాలు, చిగుళ్ల ఆరోగ్యానికి, రక్తవృద్ధికి , రోగనిరోధక శక్తి పెరగడానికి తోడ్పడుతుంది. ఇందులో ఉన్న విటమిన్ బి నోటిపూత, తెల్లమచ్చలు, పెదాలపై పగుళ్లు రాకుండా కాపాడుతుంది. కెరోటిన్, ఏ,బి,సి,ఇ విటమిన్‌లు, ఖనిజాలు, ఫ్లేవొనాయిడ్స్, ఫోలేట్‌లు, పాంథోనిక్ ఆమ్లాలు, పీచు వంటి పోషకాలు బొప్పాయి పండులో పుష్కలం . దీంతో రోజురోజుకు బొప్పాయి పండు తినేవారి సంఖ్య పెరుగుతుంది. కొందరు రోజు వారి డైట్‌లో చేర్చుకుంటున్నారు. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌తో పాటు బరువును తగ్గిస్తుందని వైద్యులు చెబుతారు.

రైతులకు కలిసి వచ్చే పంట



రైతులకు బొప్పాయి బాగా కలసి వచ్చే పంట. సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా బొప్పాయి సాగులో మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉంది. నాటిన 7 నెలల నుంచి కాపు ఇస్తుంది. రెండేళ్ల వరకు కాపు నిచ్చే బొప్పాయి లాభసాటి పంటనే. జిల్లాలో ఈ పంట సాగు పెరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో 5 వేల ఎకరాల బొప్పాయి సాగు ఉంది. ఈ ఏడాది మరో 1000 ఎకరాల్లో అదనంగా సాగు కానుంది. ఎకరాకు 50 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను ధర రూ.8000 నుంచి రూ.10 వేల వరకు ఉన్న రైతులకు గిట్టుబాటు అవుతుంది. ఉద్యాన పంటల్లో భాగంగా బొప్పాయి సాగును ప్రోత్సహిస్తున్నాము.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు